క్లుప్తంగా

నేడు 'బీఆర్‌ఎస్' దీక్ష

ఇల్లెందు: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయటం లేదని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నా పట్టించుకోకపోవడంతో రైతాంగానికి అండగా నిలిచేందుకు దీక్ష చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ తెలిపారు. శుక్రవారం ఇల్లెందులో మాట్లాడుతూ... పట్టణంలోని జగదాంబా సెంటర్‌లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు దీక్ష ఉంటుందని చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, క్వింటా ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ చెల్లించాలని, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని, నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలని, నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.25 వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్షలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు ఈ దీక్షలలో బీఆర్‌ఎస్ శ్రేణులు హాజరై దీక్షను జయప్రదం చేయాలని కోరారు.

గొత్తికోయలకు కోడిగుడ్లు పంపిణీ



గుడ్లు అందజేస్తున్న సీడీపీఓ రేవతి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్ల గ్రామ పంచాయితీ గంగమ్మ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలోని గొత్తికోయలకు సీడీపీఓ రేవతి కోడిగుడ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న క్రాంతినగర్ గొత్తికోయ గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి గర్భిణులు బాలింతలు, చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం పట్ల అవగహన కల్పించారు. ఎండలకు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ అశోక్‌కుమారి, అంగన్‌వాడీ టీచర్ బానోలు జ్యోతి, గ్రామస్తులు జోగయ్య, లక్కయ్య, రామకృష్ణ ఉన్నారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: ఓ ఫంక్షన్‌లో సెల్‌ఫోన్ విషయంలో తలెత్తిన గొడవ యువకుడిపై దాడి జరిగింది. ఈ ఘటనపై నలుగురిపై కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు... పెద్దమ్మగుడి వద్ద గురువారం రాయల్ ఫంక్షన్ హాల్ వద్ద బూర్గంపాహడ్ మండలం సొంపెల్లికి చెందిన నడిపట్టి సంతోష్, ప్రసాద్‌కు సెల్‌ఫోన్ విషయంలో వాగ్వాదం జరిగింది. రావుల శివరాం, సన్ని, క్రాంతి, మరోవ్యక్తి కలిసి సంతోష్, ప్రసాద్‌లపై దాడి చేసి గాయపరిచారు. దాడికి గురైన సోదరుడు జంపయ్య ఫిర్యాదు మేరకు దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

యాదన్న ఆశయ సాధనకు కృషి చేయాలి

ఇల్లెందు: విప్లవ పార్టీ నిర్మాణంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్న గండి యాదన్న ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పట్టణ కార్యదర్శి యాకుబ్ షావలీ కోరారు. శుక్రవారం ఇల్లెందు కలాసీబస్తీలోని పార్టీ కార్యాలయం వద్ద జరిగిన యాదన్న సంతాప సభలో ఆయన మాట్లాడారు. విప్లవ పార్టీలో వచ్చిన అనేక చీలికలను ఎదుర్కొని సరైన పంథాలో పయనించాడని తెలిపారు. నిజ జీవితంలో రెండు ప్రభుత్వ ఉద్యోగాలను సైతం వదిలేశాడని పీడిత ప్రజల కోసం నిరంతరం పాటు పడ్డాడని కొనియాడారు. యాదన్న చూపిన మార్గంలో పయనించటం ద్వారానే ఆయన ఆశయ సాధనకు కంకణం కట్టుకున్నట్లు అవుతుందని పేర్కొన్నారు. ఈ సభలో మాస్‌లైన్ నేతలు పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, శేషయ్య, వీరన్న, మల్లేష్, గురునాథం, సంపత్, సీతారాములు, రవి, నరేష్, వెంకన్న పాల్గొన్నారు.

నీటి శుద్ధికి తిలోదకాలు!

- 'మినరల్' పేరుతో యథేచ్ఛగా దందా
- పల్లెల్లో పుట్టగొడుగుల్లా ఆర్వో ప్లాంట్లు
- అధికారుల పర్యవేక్షణ కరువు



ఆర్వో ప్లాంట్

మంచుపల్లి: అన్నిప్రాంతాల్లో తాగునీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఎండాకాలం కావడంతో తాగునీటికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. దీన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమ వ్యాపారం చేస్తున్నారు. అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ఇళ్లలో బోర్లు వేసి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. గ్యాలన్ల కొద్దీ భూగర్భ జలాలను తోడి మినరల్ వాటర్ పేరిట మార్కెట్లో విక్రయిస్తున్నారు. సక్రమంగా నీటి శుద్ధి చేయకుండా ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. సామాన్యులకు నేడు నీళ్లు తప్పక కొనుక్కొని తాగాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదే అదనుగా భావించిన కొందరు వ్యాపారులు యథేచ్ఛగా వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తూ ప్రమాణాలు పాటించకుండా నీటిని విక్రయిస్తున్నారు. మినరల్ వాటర్ తీసుకోవడం వల్ల వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చన్న ప్రజల నమ్మకాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఈ వ్యాపారాన్ని మరింతగా విస్తరిస్తున్నారు. మండల కేంద్రాల్లోనే కాకుండా మారుమూల గ్రామాల్లోనూ ప్రభుత్వ అనుమతి లేకుండా తాగునీటి ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. జిల్లాలో ఎలాంటి అనుమతులు లేని ఆర్వో ప్లాంట్లు వందల సంఖ్యలో ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అనుమతి లేకుండానే వాటర్ ప్లాంట్లు వెలుస్తున్నాయి. అయినా ఏ అధికారీ పట్టించుకునే పరిస్థితి లేదు. చాలాచోట్ల తాగునీటి ప్లాంట్లలో నీటిని శుద్ధి చేయడంలో కనీస ప్రమాణాలను కూడా పాటించడం లేదు. కేవలం రివర్స్ ఆస్మోసిస్ (ఆర్‌ఓ) ప్రక్రియ ద్వారా అరకొరగా నీటిని శుద్ధి చేసి విక్రయిస్తున్నారు. ప్రతి ప్లాంట్‌లో యాంటీ మైక్రోబయల్ ఫిల్టర్లు వినియోగించి విధిగా నీటిని శుద్ధి చేయాల్సి ఉంటుంది. ఏదో ఒకటి, రెండు చోట్ల తప్ప అత్యధిక శాతం ప్లాంట్లలో ఈ ఫిల్టర్లు వినియోగిస్తున్న దాఖలాలు లేవు. బోరు నుంచి వచ్చిన నీటిని నేరుగా కూల్ చేసి అలాగే విక్రయిస్తున్నారు. 20 లీటర్ల నీటిని రూ.10 - 15 చొప్పున వసూలు చేస్తున్నారు. వేసవి దృష్ట్యా తాగునీటికి డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏకంగా రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు.

వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు...

ప్రమాణాలు పాటించని ఆర్వో ప్లాంట్లలో ఎక్కువ మోతాదులో రసాయనాలు కలిపిన నీటిని తీసుకోవడంతో పలువురు రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా కీళ్లనొప్పులు, గ్యాస్ ట్రబుల్, పెదవులు ఆరిపోవడం, శరీరంలో తేమ శాతం తగ్గిపోవడం, జీర్ణశక్తి దెబ్బతినడం వంటి లక్షణాలు ఏర్పడతాయని వైద్యులు చెబుతున్నారు. బోర్లలో నుంచి వచ్చే నీటిని శుద్ధిచేసి వినియోగదారులకు సరఫరా చేయాల్సి ఉంటుంది. బోరు బావి నీటిలో ఉండే ఉప్పు శాతాన్ని బట్టి నీటి శుద్ధి కోసం రసాయనాలు వాడతారు. అవగాహన లేక కొందరు ప్లాంట్ల యజమానులు ఎక్కువ మోతాదులో రసాయనాలు కలుపుతున్న పరిస్థితి. తాగునీటిని విక్రయించాలంటే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్) నిర్దేశించిన ప్రమాణాలు కొన్ని కంపెనీలకే పరిమితమవుతున్నాయి. కొందరు సరఫరా చేసే తాగునీటికి సొంతగా ఐఎస్‌ఐ మార్క్ ముద్ర సైతం వేసుకుంటున్నారు. దీంతో ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు వాపోతున్నారు. మనం తాగే నీటిలో భౌతిక, రసాయన, జీవ పదార్థాలు, ఖనిజాలుంటాయి. అవి ఎంత మోతాదులో ఉంటే ఆరోగ్యకరమన్నది భారత ప్రమాణాల సంస్థ నిర్ధారించింది. ఒక లీటరు నీటిలో కాల్షియం 75 మిల్లీ గ్రాములు, క్లోరిన్ 0.2 మి.గ్రా, సల్ఫేట్ 200 మి.గ్రా, నైట్రేట్ 45 మి.గ్రా, ఫ్లోరైడ్ 0.8 -12 మి.గ్రా, ఇనుము 0.3 మి.గ్రా చొప్పున ఉండాలి. పెద్ద పెద్ద నీటి వ్యాపారం చేసే కంపెనీలు ముడి నీటిని సేకరించి ఏ స్థాయిలో మినరల్స్ కావాలో ఆ స్థాయిలో వాటిని నీళ్లలో కలిపి అందిస్తుంటాయి. దీనికి భిన్నంగా ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులు వ్యవహరిస్తున్నా... అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. జిల్లాలో అనుమతి లేకుండా నడుస్తున్న నీటి శుద్ధి కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



వాహనాల ద్వారా నీటి సరఫరా

కొరవడిన శాఖల పర్యవేక్షణ...

ప్యూరిఫైడ్ (శుద్ధి) నీటి పేరుతో మోసం చేస్తోన్న ప్రైవేటు జల కేంద్రాలను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీల్లో అయితే పీహెచ్‌సీ వైద్యులు, ఆహార తనిఖీ అధికారి, ఎంపీడీఓ తనిఖీ చేయొచ్చు నగర పాలక సంస్థ పరిధిలో పరిశ్రమల శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, టాస్క్‌ఫోర్స్ అధికారులు పరిశీలించాలి. ప్రతీ 15 రోజులకు ఒకసారి భూగర్భ జలశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు నీటిని పరీక్షించి నాణ్యతా ప్రమాణాలు తేల్చాల్సి ఉంది. గృహాలు, హోటళ్లు, చిన్నచిన్న బడ్డీ దుకాణాలు, ఇతరులకు ప్లాంట్ల యజమానులు 20 లీటర్ల క్యాన్లతో నీటిని అందిస్తున్నారు. క్యాన్లపై నీటిని నింపిన తేదీ కచ్చితంగా ప్రచురించాలి. ఇవేమీ జరగడం లేదు సరికదా... రోజుల తరబడి నిల్వ ఉన్న క్యాన్లను సైతం సరఫరా చేస్తున్నారు. క్యాన్లను శుభ్రంగా కడిగి స్టెరిలైజ్ చేయడంతోపాటు రివర్స్ అస్మోసిస్ వ్యవస్థ ద్వారా నీటిలో బ్యాక్టీరియాను నిర్మూలించాల్సి ఉంటుంది. ఇవేమీ చేయకుండా క్యాన్లను ఏళ్ల తరబడి వాడుతుండటంతో అందులో హానీ చేసే బ్యాక్టీరియా పేరుకుపోతోంది. ఇలా అపరిశుభ్రంగా ఉన్న నీటిని తాగి ప్రజలు రోగాలను కొని తెచ్చుకుంటున్నారు.

నేడు కాంగ్రెస్ జన జాతరకు తరలిరండి..



మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం తుక్కుగూడలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల శంఖారావం జనజాతరను జయప్రదం చేయాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం అయ్యప్పనగర్‌లోని పొంగులేటి క్యాంప్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సభకు ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో పాల్వంచ నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, బద్ది కిశోర్, బాలినేని నాగేశ్వరరావు, భూక్యా గిరిప్రసాద్, మధు, నాగిరెడ్డి, చాంద్‌పాషా, పాబోలు నాగేశ్వరరావు, ఉపేందర్, శాంతి వర్ధన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్

చుంచుపల్లి: ఖమ్మం పార్లమెంట్ స్థానాన్ని గెలిపించుకునే విధంగా బీజేపీ కార్యకర్తలు పనిచేయాలని ఖమ్మం పార్లమెంట్ ప్రభారీ జె.శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తగూడెం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కొత్తగూడెం అసెంబ్లీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం అసెంబ్లీ పరిధిలో అన్ని పోలింగ్ బూత్‌లలో అధ్యక్షుడు, శక్తి కేంద్ర ఇన్‌చార్జులు, పన్నా ప్రముఖ్‌లను నియమించాలన్నారు. గ్రామాల్లో బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసి ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావును గెలిపించే విధంగా కార్యకర్తలు, సానుభూతిపరులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర బాబు, జల్లారపు శ్రీనివాస్, చింతలచెర్వు శ్రీనివాసరావు, పోనిశెట్టి వెంకటేశ్వర్లు, బైరి నిర్మల, పైడిపాటి రవీందర్, గొడుగు శ్రీధర్, రాయుడు నాగేశ్వరరావు, భూక్యా రాజేష్, రాపాక రమేష్, స్వాతి, స్వప్న, కటికల రంజిత్, బీమాల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు రవాణా టెండర్ రద్దు చేయండి



వంటావార్పు చేస్తున్న లారీ యజమానులు

టేకులపల్లి: కోయగుడెం ఓసీ నుంచి ఇల్లెందుకు బొగ్గు రవాణా టెండర్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నారు.

ఈ క్రమంలో శుక్రవారం కోయగూడెం ఓసీ సమీప గ్రామం వద్ద వంటావార్పు కార్యక్రమం నిర్వహించినట్లు టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నెలవెల్లి నరసింహారావు తెలిపారు. తమ ఆందోళనను సింగరేణి అధికారులు, తక్కువ రేటుకు టెండర్ వేసిన కాంట్రాక్టర్‌కు కనువిప్పు కలిగి టెండరు రద్దు చేసుకోవాలని ఆశిస్తున్నామని తెలిపారు. లేదంటే మా పరిస్థితి మా లారీలపై పనిచేస్తున్న కార్మికులు రోడ్డున పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రామారావు, సురేష్, వీరన్న, వెంకన్న, నరేష్, రవి పాల్గొన్నారు.

ఓటర్లలో చైతన్యం కోసం 'సెల్ఫీ పాయింట్'



సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీఓ

పాల్వంచరూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాస్వామ్య బద్ధంగా ప్రతీఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటర్లను చైతన్య పరచడం కోసం ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల పంచాయతీ అధికారి బి.నారాయణ కోరారు. జగన్నాథపురం పంచాయతీ పెద్దమ్మగుడి వద్ద శుక్రవారం ఆయన సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు. మాట్లాడుతూ... రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీఒక్కరు ఓటు హక్కును నిష్పక్షపాతంగా ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా కులమతాలకు అతీతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని చైతన్య పరిచేందుకు సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు సాయిరాం, రణధీర్, నాగేశ్వరరావు, రాంబాబు, ప్రవీణ్, రాజు, కృష్ణవేణి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగి అదృశ్యం



వంశీకృష్ణ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణంలోని రుద్రంపూర్ ప్రాంతానికి చెందిన సింగరేణి ఉద్యోగి రాయల వంశీకృష్ణ కనిపించకుండా పోయాడని శుక్రవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... రుద్రంపూర్ నాలేరియాకు చెందిన రాయల వంశీకృష్ణ కొత్తగూడెం ఏరియా పరిధిలోని సింగరేణి కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. మూడేళ్లుగా సింగరేణి ఉద్యోగానికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడని, ఈ నెల 1న మధ్యాహ్నం డ్యూటీకి వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లినట్లు తెలిపారు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య శైలజ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వంశీకృష్ణకు 36 సంవత్సరాలు ఉంటాయని, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు భార్య తెలపగా ఫిర్యాదు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తగూడెం టూటౌన్ పోలీసులు తెలిపారు.

అటవీశాఖ అధికారుల నిరసన



నిరసన తెలుపుతున్న అటవీ అధికారులు, సిబ్బంది

జూలూరుపాడు: ములకలపల్లి అటవీ రేంజ్ పరిధిలోని చింతలపాడు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోత్ పూర్ణపై గొత్తికోయలు దాడి చేయడాన్ని జూలూరుపాడు రేంజ్ పరిధిలోని అటవీశాఖ అధికారులు, సిబ్బంది తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జిల్లా అటవీశాఖ యూనియన్ పిలుపులో భాగంగా విధులు నిర్వర్తిస్తూనే నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపినట్లు జూలూరుపాడు అటవీశాఖ అధికారులు, సిబ్బంది తెలిపారు.

ఎఫ్‌బీఓపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు, ఎఫ్‌ఎస్‌ఓలు లక్ష్మీనర్సు, సలీం, ఎఫ్‌బీఓలు బి.నరసింహారావు, వెంకటేశ్వర్లు, కిషన్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ములకలపల్లి మండలం అన్నారం బీట్ అధికారి పూర్ణపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన వారిని కఠినంగా శిక్షించాలని అటవీశాఖ ఇల్లెందు డివిజన్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాంసింగ్, మురళి, ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు కోరారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. విధి నిర్వహణలో భాగంగా నీటి నిల్వ కుంటకు గండి కొట్టడాన్ని అడ్డుకున్నాడన్న కోపంతో పూర్ణపై అతని సోదరుడు దాడి చేశారని పేర్కొన్నారు.

మినీ బస్.. హెవీ జనం..





బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

ఇల్లెందు: ఇల్లెందు బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు ప్రయాణికులు పోటీ పడుతున్నారు. మినీ బస్ ఎక్కేందుకు జనం ఎక్కువగా ఉన్నారు. ఇలాంటి సంఘటనలు నిత్యకృత్యంగా ఉంటున్నాయి. శుక్రవారం రాత్రి ఇల్లెందు - మహబూబాబాద్ వెళ్లే మినీ బస్‌కు మించిన జనం బస్సు ఎక్కేందుకు తంటాలు పడ్డారు. సీట్లు అటుంచి.. కనీసం నిలబడి వెళ్లేందుకు కూడా స్థలం లేకుండా ప్రయాణికులు ఉండడంతో గాబరా నెలకొంది. అసలే పెళ్లిళ్ల కాలం కావటంతో ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లి తిరుగు పయనంలో గమ్యం చేరుకునేందుకు ఆరాటపడ్డారు. ఇలా ఒక్కసారిగా భారీగా జనం రావటంతో బస్టాండ్ ఆవరణం కిక్కిరిసిపోయింది. కొంతమంది కిటికీల్లోంచే బస్సు ఎక్కారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రయాణికులకు తగ్గట్టు బస్సు సర్వీసులు నడపాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ఫీడర్ లైన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7:30 నుంచి మధ్యాహ్నం 12 వరకు రేగళ్ల విద్యుత్ ఉపకేంద్రం కింద గల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు సహకరించాలని ఏఈ రఘు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆదర్శప్రాయుడు బాబూ జగ్జీవన్‌రామ్

ధీరోదాత్తత, దేశభక్తి, దైవభక్తి లాంటి ఎన్నో గొప్ప లక్షణాలు ఉన్న మహనీయుడు భారత తొలి ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్. ఆయన 117వ జయంతిని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. దళిత, బడుగు బలహీన వర్గాల జీవులు వర్ణ వివక్ష లేకుండా ఉన్నత స్థానాల్లో ఉండాలని, అంటరానితనం రూపుమాపాలని తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జూలూరుపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...



పాల్వంచ: నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



మాట్లాడుతున్న కేటీపీఎస్ సీఈ ప్రభాకర్‌రావు



చుంచుపల్లి: జెడ్పీలో... చైర్మన్ కంచర్ల, తదితరులు



కొత్తగూడెంటౌన్: ఎస్పీ కార్యాలయంలో...



బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...



సింగరేణి(కొత్తగూడెం): నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు







జూలూరుపాడు: నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో.., ఎస్సీ హాస్టల్‌లో..

ఏజెన్సీలో తాగునీటి ఇక్కట్లు

పాల్వంచరూరల్: ఏజెన్సీలోని గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం తల్లడిల్లుతున్నారు. అటవీ ప్రాంతంలో జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనులు తాగునీటి కోసం అరిగోస పడుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. తాగునీటి కోసం కిలోమీటరు దూరం కాలినడకన వెళ్తేనే నీళ్లు. అవి కూడా కలుషితమైన చెలిమ నీరే దిక్కు. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలం బంద్రుగొండ పంచాయతీ కొయ్యగట్టు గ్రామంలో 270 మంది గిరిజనులు నివాసం ఉంటున్నారు. ఒక చేతిపంపు మాత్రమే ఉంది. అది కూడా వేసవిలో నీళ్లు సక్రమంగా రాని పరిస్థితి. సోలార్‌పంప్ సెట్టును ఏర్పాటు చేశారు. కానీ దాని మోటారు నాలుగు నెలల క్రితం భూమిలో కూరకపోవడంతో పనిచేయకపోవడం లేదు. ఉన్న బోరు నీరే ఆధారం కావడంతో అది అవసరాలకు సరిపోక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలోమీటరు దూరంలో వాగు ఒడ్డున చెలిమలు తీసుకుని నీటిని తెచ్చుకుంటూ అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా బంజర గ్రామపంచాయతీలోని అటవీప్రాంతంలో నివాసం ఉంటున్న రాళ్లచెలక, పెద్దకలస, చిరుతానిపాడు గ్రామంలోని ఆదివాసీ గిరిజన కుటుంబాలు సుమారు 250 మంది ఉన్నారు. ఆయా గ్రామాల్లో వేసవికాలం వచ్చిందంటే తాగునీటి కోసం తల్లడిల్లుతారు. ఒక్క బోరు కూడా లేక పోవడంతో వాగులు, వంకల్లో చెలిమల ద్వారా కలుషితమైన నీటిని తాగుతున్నారు. కావడ్లు, బిందెల మీద బిందెలు, బుర్రల్లో తాగునీటిని తెచ్చుకుంటూ అవస్థలు పడుతున్నారు. చెలిమలో కూడా ఊట సక్రమంగా రాకపోవడంతో ప్రజలు తాగునీటికి పడరాని పాట్లు పడుతున్న పరిస్థితి. పంచాయతీ గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం కిలోమీటరు దూరం వెళ్లి కలుషితమైన చెలిమ నీటిని తెచ్చుకుని తాగుతున్నామని వాపోతున్నారు.





కలుషితమైన చెలిమ నీటిని తోడుకుంటున్న చిరుతానిపాడువాసులు

సోలార్ పంప్‌ను నడిపిస్తాం..

కొయ్యగట్టులో సోలార్‌పంప్ బోరు మోటార్ భూమిలో కూరకపోవడం వలన పనిచేయడంలేదు. మండల నిధులు రూ.2లక్షల మంజూరు అయ్యాయి. కొత్త మోటారును కొనుగోలు చేసి నీరు అందిస్తాం. – నీలావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గాంప్రసాద్ -79979 58226 | టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148